

# ఎందుకే నీకింత తొందరా...



- బలభద్రపాత్రుని రమణి

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్ధం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**జీవితం** ఏ ఒక్కరికోసం ఆగదు. ఏ కష్టం వచ్చినా సుఖం వచ్చినా గడియారం ముల్లు ఆగి చోద్యం చూడదు. ముందుకి సాగిపోతూనే వుంటుంది. అందుకు తార్కాణం నా జీవితం. నేను అమెరికా వచ్చినట్లు ద్వారకకి చెప్పలేదు.

హనీష్ వచ్చి వాడే నాకన్నా పెద్దయినట్లు బాధ్యత తీసుకుని కాలేజీలో చేర్పించి, ఎకామిడేషన్ చూసి నీనా సింగోరియా అనే అమ్మాయి నా రూం మేట్‌కి జాగ్రత్తలు చెప్పి, క్రెడిట్ కార్డ్, లాప్‌టాప్, ఫోన్ ఇచ్చి వెళ్ళాడు.

వెళ్ళేముందు చిపోట్లేకి తీసుకెళ్ళాడు.

"ఇన్ని రకాల సాస్‌లూ గట్రా ఎందుకేస్తారురా వీళ్ళు? చిన్నప్పుడు మన ఇళ్ళముందికి ముష్టివాడొస్తే, బామ్మ పులుసూ, కూరా, పప్పూ, అన్నం ఒకే గిన్నెలో వేసి పంపినట్లు?" అన్నాను.

హనీష్ చెప్పాడు "ఇక్కడ పుట్టి పెరిగిన పిల్లలకి కూడా జీవితం అంతా కలగాపులగంగానే వుంటుంది. ఏ అమ్మా నాన్నలు మన ఇండియాలో మన తిండీ, నిద్రా, బట్టలూ, చదువూ, మన పెళ్ళి గురించి పట్టించుకుంటున్నారు అని మనం అతిగా బాధ పడిపోతున్నామో అవేవీ లేక ఇక్కడ అగమ్యగోచరంగా కొందరు కనపడతారు. పని చెయ్యకపోతే పొట్ట నిండని వాళ్ళూ, పగలు పనిచేసుకుంటూ, రాత్రుళ్ళు చదువుకునేవాళ్ళూ కొందరైతే, జీవితం ఎటుపోతే అటు పోనీ అని డ్రగ్స్, సెక్స్, అండర్ గ్రౌండ్ అంటూ పాడయిపోయేవాళ్ళు కొందరు. మన ఇండియన్ ఫ్యామిలీస్ ఇక్కడ సెటిల్ అయిపోయిన వాళ్ళ పిల్లలని ABCD అంటే 'అమెరికా బోర్న్ కన్ఫ్యూజ్‌డ్ దేశీ'లు అని ఎందుకు అంటారంటే, మన పరీలా స్కూల్‌కి వెళ్తే అక్కడ కలిసే పిల్లల జీవనం వేరేగా వుంటుంది .వాళ్ళ తిండీ, ఏక్సెంట్, డ్రెస్, లైఫ్ స్టైల్ ... హీ ఈజ్ మై హాఫ్ బ్రదర్" అంటారు. అంటే అమ్మకి ఇంకో తండ్రితో పుట్టిన పిల్లలు. "హీ ఈజ్ మై స్టెప్ డాడ్" అని పరిచయం చేస్తారు. ఇద్దరు ఆడవాళ్ళు ప్రేమగా చేతిలో చెయ్యి వేసుకుని నడుస్తూ "మై పార్టనర్ లవ్స్ ఇండియన్ ఫుడ్" అని మనతో

ఎంతో గర్వంగా తమ స్వలింగ పార్ట్‌నర్స్‌ని చూపించగలరు. ఇవన్నీ జీర్ణం చేసుకోలేని వయసులో, ఇంట్లో మన అత్తయ్యా, మావయ్యలు పూజలూ, వరలక్ష్మీ వ్రతాలూ, పిల్ల పాడయిపోతుందేమోనని, స్కూల్ వదలగానే ఇంటికి రావాలీ, బోయ్ ఫ్రెండ్ వుండకూడదూ అనే రూల్స్ చెప్తుంటే తికమకగా వుంటుంది. సాటి పిల్లలు "హౌ ఓల్డ్ ఆర్ యూ? నీకింకా బోయ్ ఫ్రెండ్ లేదా? ఎనీ థింగ్ రాంగ్ విత్ యూ? ఆర్ యూ ఇన్‌ట్రెస్టెడ్ ఇన్ సేం సెక్స్?" అని పదమూడేళ్ళకే అడిగేస్తుంటారు. ఈ రెండు సంస్కృతుల మధ్య ఒక జెనరేషన్ శాండ్‌విచ్ అయిపోతుంది. తర్వాత వాళ్ళు ఏ అమెరికన్‌నో పెళ్ళి చేసుకుంటే పుట్టే పిల్లలకి ఈ కన్‌ఫ్యూజన్ వుండదు.

"మై స్కిన్ కలర్ ఈజ్ బ్రౌన్ బికాజ్ ఆఫ్ మై డాడ్" అని చెప్పగలరు.

"అమ్మో! ఇంకో దేశంలో పెరిగే మన పిల్లలకి ఇంత ప్రోబ్లెమ్ వుంటుందా?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును. అమ్మా నాన్నలు విడిపోడం, ఇంకో పెళ్ళి చేసేసుకోడం, హాఫ్‌బ్రదర్స్ వుండడం ఇక్కడ చాలా సహజం. మన ఇళ్ళల్లో ఇంకా అవి విస్తుపోతూ చర్చించే విషయాలు" అని నవ్వాడు హనీష్.

"ఐ పీటీ దిస్ ABCD జెనరేషన్ కిడ్స్" అన్నాను.

"నీకు ద్వారక వింతగా కనపడడానికి కారణం, నువ్వు ఎంత మోడ్రెన్‌గా తయారయినా, బామ్మతో కూర్చుని సతీ సుమతి చూడడం, అమ్మతో బాటు టీ.వీ సీరియల్స్ చూడడం" అన్నాడు.

నేను సీరియస్‌గా చూసాను.

"అతని టాపిక్ ఇప్పుడెందుకు?" అన్నాను.

"నీ ఫస్ట్ లవ్ అనుకుంటున్నానే... నాకు తెలిసినంతవరకూ "

"కాదు" టక్కున చెప్పాను ఈగోకి పోయి.

"అయితే మంచిదే. తక్కువ హర్ట్ అవుతావు" అన్నాడు.

"నిజమే! వాళ్ళు పుట్టిన వాతావరణం, అమ్మా నాన్నల పెంపకం, సామాజిక నేపథ్యం.. ఎకనామిక్ స్టేటస్ ఇవ్వన్నీ వారి ప్రవర్తనకి కారణాలు" అన్నాను.

హనీష్ నా చేతిని పట్టుకుని "ఫోకస్ ఆన్ యువర్ స్టడీస్. కెరీర్.. రెండేళ్ళలో నీకు ఏం కావాలో నీకు తెలిసేటంత మెచ్యూరిటీ వస్తుంది! యూ. ఎస్ అనేది లాండ్ ఆఫ్ ఆపర్ట్యూనిటీ మాత్రమే కాదు.. లాండ్ ఆఫ్ మెచ్యూరిటీ" అన్నాడు.

నాకన్న చిన్నవాడు నాకు మెచ్యూరిటీ రాలేదని చెప్తున్నాడు కర్మ. నన్నిలా పెంచిన వసుంధర మీదా, నాన్నమీదా కోపం వచ్చింది .మరి వాడు ఎలా మెచ్యూ రయ్యాడూ? అదే వాడిని అడిగాను.

"ఎం.ఎస్. సెకండ్ ఇయర్‌లో ఒక రెస్టారెంట్‌లో పని చేస్తూ, డిషెస్ తోముతుంటే, లోపల రేకు వుండినా అరచేతి కుట్లు పడేటంత తెగిపోయింది. వారం రోజులు స్పూన్ పట్టుకుని తినడానికి కూడా రాలేదు. అప్పుడు నాన్న ఫోన్ చేసి "హనీ! సిగరెట్లు తాగకు. అక్కడ ముందు విరివిగా దొరుకుతుందని అలవాటు చేసుకోకు" అని చెప్తుంటే నాకు మండింది.

అరచెయ్యికాదు, మనసు. కానీ జాలేసింది, పిచ్చి తండ్రి తను పంపే డబ్బులతో నేను ఆ లగ్జరీస్ అన్నీ చెయ్యగలుగుతాను అనుకుంటున్నందుకు" అన్నాడు.

హనీ అరచెయ్యి తెరచి చూసి వూదాను అప్రయత్నంగా.

ఇక్కడ డబ్బులు సంపాదించడం, ఖర్చు పెట్టడం రెండూ ఈజీ. పొదుపుగా వుండాలి" అన్నాడు.

"నాన్న పాపం నాకూ డబ్బులు పంపుతున్నాడు. పెన్షన్ మీద బతకాల్సిన వయసు వస్తోంది. నేనూ కొంచెం కొంచెం సాయం చేసే రోజు వస్తుందంటావా?" అన్నాను.

"ఆయనకీ అమ్మకి నువ్వు లైఫ్ గురంచి తెలుసుకుని, కొంచెం కేర్‌ఫుల్‌గా స్టెప్స్ వేస్తే అదే చాలు" అన్నాడు.

"నేను వాళ్ళు చెప్పిన గోపాలం బావనో, సోమేశ్వరరావునో పెళ్ళి చేసేసుకుని, వత్తులు వెలిగించి కార్తీక దీపాలు గోదాట్లో వేసేసి, శీమంతం చేయించుకుని అర్జెంటుగా ఇద్దరు పిల్లల్ని కనేస్తే సాటి వాళ్ళముందు తల ఎత్తుకుని తిరిగే వాళ్ళు అనుకుంట. అలా నేను చెయ్యలేను" అన్నాను. నాకు ద్వారక గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"రిలాక్స్" నా తమ్ముడు నా భుజం చుట్టూ చెయ్యి వేసాడు.

"వన్ ఎట్ ఏ టైం... ఈ అద్భుతమైన పిరేడ్ మళ్ళీ రాదు. ఈ దేశంలో వుండి చదువుకోవడం, ఫ్రీడం అనుభవించడం ఇవన్నీ పెళ్ళి చేసుకుని, పిల్లాడి డైపర్స్ మారుస్తున్న నీ ఫ్రెండ్స్‌కి దొరికే అవకాశాలు కావు. యుటిలైజ్ దెమ్!" అన్నాడు.

వాడి భుజం మీద తల పెట్టాను. సిబ్లింగ్స్ వుండటం ఎంత అదృష్టమో. మరీ ఒక్క పిల్లని కని ఆపేసుకోని అమ్మా నాన్నల మీద కృతజ్ఞత కలిగింది. అమ్మా నాన్నలతో పంచుకోలేనివి కూడా తోడబుట్టినవాళ్ళతో పంచుకోగలం. సేమ్ జెండరే కానవసరంలేదు. ఇంతకాలం అక్కగా వాడి మీద అజమాయిషీ చెయ్యాలనుకునే ఇండియన్ మెంటాలిటీ వుండేది. ఇప్పుడు వాడిలో ఒక ఫ్రెండ్‌ని చూస్తున్నాను. హనీ ఎంతో పెద్దవాడయిపోయాడు. ఎంతో ఎదిగిపోయాడు.

హనీష్ యూనివర్సల్ స్టూడియోస్‌లో నన్నెక్కించిన జైంట్ వీల్ రైడ్ కంటే, రూంమేట్‌తో కలిసి బతకడం ఎక్కువ గాబరాగా వుంది. నీనా మాతృభాష మరాఠీ, నాతో కొంచెం హిందీ కూడా మాట్లాడ్తుంది. ఇక్కడ ఫ్రెండ్స్ మన యాషికాలా వుండరని అర్థమైంది.

నీనా తన బెడ్, తన ప్లేస్, తన వస్తువులు ఫ్రిజ్‌లో వున్నవీ, పాత్రలూ అన్నీ లేబుల్ చేసి పెట్టుకుంది. నాతో డ్యూటిస్ చెప్పడానికి నా సుపీరియర్‌గా మాత్రమే మాట్లాడేది.

"వారానికి రెండుసార్లు నువ్వు బాత్‌రూం క్లీన్ చెయ్యాలి, రోజూ కిచెన్ ఫ్లాట్‌ఫార్మ్ తుడవాలి" లాంటివి.

నేను నిద్రపోతుంటే తను ఫోన్ మాట్లాడేది. నేను ఎప్పుడైనా గట్టిగా ఫోన్‌లో అమ్మతో మాట్లాడితే "ష్" అని సైగ చేసేది. ఏదో లింగ్విస్టిక్స్‌లాంటి సబ్జెక్ట్ చదువుతోందిట. సాటర్‌డే ఈవినింగ్ ఒకరోజు అడిగింది "నీకు రిలెటివ్స్, ఫ్రెండ్స్ ఎవరూ లేరా ఈ ఊళ్ళో?" అని.

"లేరు" అన్నాను. నాన్న ఫ్రెండ్ వివేకానందా అంకుల్, ఆండాళ్ళు ఆంటీ వున్న కూడా.

"ఏంలేదు. నా బోయ్ ఫ్రెండ్‌ని పిలుద్దాం అనుకున్నా, నువ్వెళ్తే. ఫర్ వన్ డే ప్రైవసీ. నేను నీకు కూడా ఇస్తా" అంది.

ఇక్కడ లాండ్ లార్డ్స్ ఏమీ పట్టించుకోరు. అదే ఇండియాలో అయితే పక్కింటి పంకజం ఆంటీలూ, ఇంటి ఓనర్ అంకుల్స్ ఆరాగా చూస్తారు. చివరికి ఫ్లాట్స్‌లో కూడా అదో గొప్ప నేరంలా మీటింగ్స్ పెడ్తారు. ఫలానా ఫ్లాట్‌లో పెళ్ళికాని అమ్మాయి ఓ అబ్బాయిని తీసుకొచ్చిందని.

"సండే వెళ్తానులే. బట్ సెవెన్‌కల్లా వచ్చేస్తా ఎసైన్‌మెంట్స్ వున్నాయి" అన్నాను.

ఆమె ఆ సాయానికి నాతో కృతజ్ఞతగా కాదుకానీ స్నేహంగా వుంటుందని ఆశించాను. అలా ఏం జరగలేదు.

"ఐ అప్రీషియేట్ ఇట్" అని వూరుకుంది.

"ఏ టైంకి వెళ్తావ్? చెప్పు జెన్‌కి చెప్పాలి" అని అడిగింది.

"టెన్ ఏ. ఎమ్ ఓకే?" అడిగాను.

"ఓకే. థాంక్స్" అది.

కాలేజీలో మాత్రం పాఠాలూ, ప్రొఫెసర్స్, వాళ్ళు చెప్పే విధానం, తోటి క్లాస్‌మేట్స్ చాలా బావుంది. అసలు ఆ కాంపస్‌లో తిరగడమే ఆనందంగా వుంది. నేను ఎప్పుడైనా బర్గర్స్ అవీ పదిసార్లు 'వీగన్' అని చెప్పి కొనుక్కు తినేదాన్ని. నార్మల్‌గా ఇంట్లో అమ్మ ఇచ్చిన ఇన్‌స్టంట్ ఉప్మా, కానీ శాండ్‌విచ్ కానీ చేసి పట్టుకెళ్ళేదాన్ని. నేను రోటీలోకి ఆలూ కూర చేసినా "ఇండియన్ స్మెల్" అని ముక్కులు చిట్లించి విసుక్కునేది నీనా. అసలు ఇంత ఎత్తినాటుతనమేమిటి చెప్మా అనుకునేదాన్ని.

నేను నీనాకి మాటిచ్చిన సండే రానే వచ్చింది. ఇష్టంలేకపోయినా, వివికేనందా అంకుల్‌కి కాల్ చేసి "రేపు మీకేం వేరే ప్రోగ్రామ్స్ లేకపోతే నేను రావాలనుకుంటున్నాను" అని చెపితే "ఇది నీ ఇల్లే అనుకో. నిరభ్యంతరంగా రా అమ్మా" అన్నారు అంకుల్, ఆంటీ.

మనవాళ్ళ విలువ ఇతర దేశాల్లో వుంటే కాని తెలిసి రాదు.

నేను డబ్బులు చాలా పొదుపుగా ఖర్చు చేస్తున్నాను. ఇండియన్ స్టోర్స్‌కి వెళ్ళి నాలుగు టమాటాలూ, రెండు ఆలూ, ఒక ఉల్లిపాయకొని, అమ్మో పది డాలర్లు అనుకునేదాన్ని. ఆవాల దగ్గరనుండి చూసి చూసి వాడడం, అదే అమ్మ దగ్గరుంటే "చిక్కుడు కాయకూరా? నువ్వే తిను.. నీళ్ళోడుతూ తోటకూర ఏం తినాలనిపిస్తుందీ? అసలు ఈ గుమ్మడికాయ దిష్టి తియ్యడానికి తప్ప వండుకోడానికి పనికొస్తుందా?" అని అరిచినదంతా గుర్తొస్తోంది.

సేఫ్‌వేకి వెళ్ళి ఫ్లవర్స్ కొన్నాను. రెండు రోజులు బయట కాఫీ మానేయాలి ఆ ఖర్చుకి అనుకున్నాను.

నేను సిటీ బస్ ఎక్కి దిగి, కొంచెం దూరం నడిచి వివేకానందా అంకుల్ ఇంటికి చేరుకున్నాను. వాళ్ళిద్దరూ డాక్టర్స్. పిల్లలు అమెరికన్‌ని ఒకరూ, ఆమెరికన్ ఆఫ్రికన్‌ని ఒకరూ చేసుకుని దూరంగా వేరే స్టేట్‌లో వున్నారు. నాన్నకి ఆయన స్కూల్‌మేట్‌ట విజయవాడలో.

నేను వెళ్ళేసరికి ఎం.ఎస్.సుబ్బలక్ష్మి పంచరత్నాలు వినిపిస్తున్నాయి. అంకుల్ బయట లాన్‌లో మొక్కలకి నీళ్ళు పెడుతూ కనిపించారు.

"వెల్‌కం.. వెల్‌కం.. నీకోసమే వెయిట్ చేస్తున్నాను. ఆంటీ ఇప్పటికి నాలుగుసార్లు ఫోన్ చేసి ఎంతదాకా వచ్చావో, నీకు లిఫ్ట్ ఏమైనా కావాలేమో కనుక్కోమని అడిగింది" అన్నారు.

"నేను నవ్వి "నాకు అంత కష్టం కాలేదు అంకుల్" అన్నాను.

ఆంటీ అయితే హగ్ చేసేసుకుని లోపలికి తీసుకెళ్ళారు. షాట్స్‌లో వున్నారు. "ఇప్పుడే జిమ్ చేసొచ్చా" అన్నారు.

లోపలికి తీసుకెళ్ళి "అలా హాల్లో సోఫాలో కూర్చునే దూరపు చుట్టానివి కావు. కమ్! కిచెన్‌లోకి రా" అన్నారు ఆండాళ్ళు ఆంటీ.

కిచెన్ ఎంత బావుందో సినిమాల్లో మాత్రమే నేను అలాంటి కిచెన్స్ చూసాను. హేంగింగ్ లైట్స్, మధ్యలో ఐలాండ్ మీద కొచ్చేట్లు షాండ్లియర్, తెల్లగా మెరిసిపోతున్న క్రోకరీ సెట్. వాటిలో పొగలు కక్కుతున్న గారెలూ, పక్కనే అల్లం పచ్చడీ, సేమ్యా పాయసం.

"నేను షవర్ చేసొస్తాను.. నువ్వూ మీ అంకుల్ తింటూ వుండండి" అని ఆంటీ పైకి వెళ్ళారు.

రవి శంకర్ సితార్ వాదన మంద్రంగా వినిపిస్తోంది.

అంకుల్ షవర్ చేసొచ్చారు "రామ్మా!రా టిఫిన్ చేద్దాం" అని వడ్డించారు.

"పాపం ఆంటీ చాలా కష్టపడ్డారు" అన్నాను.

"ఏం చేసీ? ఇవన్నీ చేసింది నేను" అన్నారు.

"అవునా?" అన్నాను ఆశ్చర్యంగా

"గారెలు అంత గుండ్రంగా మా నాన్న అయితే వెయ్యలేరు. 'వసూ ఇంకా మొరమొరలాడాలి ' అని వంకలు మాత్రం పెట్టగలరు. గ్రేట్ అంకుల్ మీరు" అన్నాను.

ఆయన నవ్వి "ఆంటీ పప్పు రుబ్బితే నేను గారెలు వేసా. ఆంటీ పోపు రెడీ చేస్తే నేను పచ్చడి చేసా. ఏ పనైనా ఇద్దరం సగం సగం చేస్తాం" అన్నారు.

ఆంటీ కూడా లూజ్ కాటన్ షర్ట్ పైజామస్‌లో వచ్చి మమ్మల్ని జాయిన్ అయ్యారు. చక్కగా అంకుల్‌లాగే జుట్టు తనూ షార్ట్‌గా కట్ చేసేసుకున్నారు. నో నాన్‌సెన్స్. హాయిగా అరమరికలు లేకుండా మాట్లాడ్తున్నారు.

మీ నాన్న ఎన్.టి.ఆర్, క్రిష్ణా ఫ్యాన్, నేను ఏ.ఎన్.ఆర్, శోభన్‌బాబు ఫ్యాన్‌ని. ఇద్దరం రోజూ పోట్లాడుకునేవాళ్ళం" అని అంకుల్ చెప్తున్నారు.

"వివేక్.. లంచ్‌కి ఏం చేసుకుందాం?" ఆంటీ అడిగారు.

"మనామ్మాయి ఇష్టం .. రుష్యేంద్రమణీ పద హార్వెస్ట్ చేద్దాం" అన్నారు అంకుల్.

ఇద్దరం వాళ్ళ గార్డెన్‌లోకి నడిచాం. ఆకు కూరలూ, చిక్కుళ్ళూ, టమాటాలూ, వంకాయలూ, పొట్లకాయలూ, సొరకాయలూ.. నాకు అవి చూస్తేనే కడుపు నిండిపోయింది.

"టమాటా పప్పు, సొరకాయ పులుసు, వంకాయ కూర, దోసకాయ పచ్చడీ" అంటూ అంకుల్ నా చేత కోయించారు.

"అమ్మో అంకుల్ ఇన్ని తినగలమా?" అన్నాను.

"నీకు కొన్ని ఇస్తాముగా.. ఆ మూల స్ట్రాబెరీస్, సపోటాలూ వున్నాయి. చాలా కష్టపడి తెప్పించా సపోటా గింజలు" అని అంకుల్ చెప్తున్నారు.

ఆంటీ కాఫీ కప్పులతో గార్డెన్‌లోకి  వచ్చారు.

ఆవిడ చాలా ఆప్యాయంగా అమ్మగురించీ, బామ్మ గురించీ అందరి గురించీ అడిగి తెలుసుకున్నారు.

సౌమ్యా, కామ్యా అని ఇద్దరు పిల్లల గురించీ, వాళ్ళ స్పెషలైజేషన్స్ గురించీ చెప్పారు. ఒక అమ్మాయి నాసాలో సైంటిస్ట్, ఇంకో అమ్మాయి గైనకాలజిస్ట్ ఆంటీలాగే. వాళ్ళకి "ఎబ్" అనే మూడేళ్ళ మనవడు కూడా వున్నాడుట రెండో అమ్మాయికి. ఫోటోలు చూపించారు. ఆ ఇద్దరు అమ్మాయిలూ భరతనాట్యం చెయ్యడం ఇంకా పెద్ద విశేషం. ఎంత నిగర్వంగా వున్నారు అనిపించింది.

ఆంటీ అంకుల్ వంట చేస్తుంటే, నేను రెండు మూడు పాటలు పాడి వినిపించాను. అంకుల్‌కి ఎంకి పాటలు అంటే ఇష్టంట. ఆయన పాడారు. తర్వాత కార్డ్స్ ఆడాం. భోజనాలు చేసాక ఆంటీ వెళ్ళి కాసేపు పడుకున్నారు. అంకుల్ నేనూ కారమ్స్ ఆడాం. ఇంట్లోనే షటిల్ కోర్ట్, బాస్కెట్ బాల్ కోర్ట్ అన్నీ వున్నాయి.

"ఎంత బావుంది అంకుల్ మీ ఇల్లు" అన్నాను.

"మరైతే ఆ రూం ఖాళీ చేసి వచ్చెయ్యి. మతోపాటే వుండిపో" అన్నారు.

"యూనివర్సిటీకి దగ్గర అంకుల్. పైగా పాయసం ఇష్టం అని రోజూ తినలేముగా" అన్నాను.

"ఫీల్ ఫ్రీ టు కం. ఇంత పెద్ద ఇంట్లో మేం ఇద్దరమే. ఏమీ పొద్దు పోదు. ఇవాళ నువ్వు వచ్చావు చాలా సరదాగా గడిచింది" అన్నారు.

సాయంత్రం సెవెన్ అవుతుంటే నేను ఇంటికి బయలుదేరాను. నాకు వారానికి సరిపడా ఫుడ్, వెజిటబుల్స్, ఫ్రూట్స్ అన్నీ పాక్ చేసి ఇచ్చారు ఆంటి.

"ఇది నీకు బావుంటుంది చూడు" అంటూ కొన్ని షర్ట్స్, జాకెట్స్ ఇచ్చారు. అన్‌లిమిటెడ్ లవ్ షవర్ చేసారు నామీద. అప్పుడప్పుడూ వస్తూ వుండాలి అనిపించింది. 'థాంక్స్ టు నీనా' అనుకున్నాను.

నేను రూముకొచ్చేసరికి 'జెన్' ఇంకా వెళ్ళలేదు. నాకు చాలా సిగ్గేసింది.

"అప్పుడే వచ్చేసావా?" అంది నీనా తలుపు తీసి.

"ఇట్స్ ఎయిటో క్లాక్" నిర్మొహమాటంలో ఆమెనే అనుకరించాలనుకున్నాను.

"హాయ్.. జెన్" అతను లేచి చెయ్యి చెయ్యి కలిపాడు.

"ఐ లవ్ ఇండియన్స్" అన్నాడు.

ఎక్కడ రేసిస్టులు అనుకుంటామో అని ఇదొకటి చెప్తూంటారు ఇక్కడ.

నాముందే నీనాని ముద్దులు పెట్టుకుంటుంటే, నేను రూములోకి వెళ్ళిపోయాను. బెడ్‌రూం అంతా చిరాగ్గా వుంది. నాకైతే ఆ విడిచిన బట్టలూ అవీ ట్రాష్ బిన్‌లో వేసి, గదంతా ఫినాయిల్‌తో కడగాలనిపించింది.

అతను ఇంకో గంటకి వెళ్ళాడు.

"థాంక్స్" అంది నీనా. ఆమె మొహం మొదటిసారిగా ప్రసన్నంగా వుంది.

"తిను" నేను ప్లేట్‌లో పెట్టి గారెలు ఇచ్చాను.

ఆమె తిని "ఆసం.. బావున్నాయి. డూ యూ హేవ్ బోయ్ ఫ్రెండ్?" అడిగింది.

'నో ' అనడానికి గొంతు సహకరించలేదు. అతి కష్టం మీద పెగుల్చుకుని "నో" అన్నాను.

"శాడ్ ఫర్ యూ" అని నవ్వింది.

"ఐ హేడ్.." అన్నాను

బ్రేకప్ అయిపోయిందా?" అడిగింది.

"యా..." అన్నాను.

"నాకూ రెండు మూడుసార్లు అయ్యాయి" చాలా మామూలుగా  అంది.

"లైఫ్‌లో ఏదీ పర్మినెంట్‌కాదు మన తల్లితండ్రులు తప్ప" అంది.

ఆ రాత్రి చాలాసేపు ఆలోచనలో పడ్డాను. నిజమా? ఏదీ పర్మినెంట్ కాదా? ఈ 'జెన్'కూడా పర్మనెంట్ కాదా? ఇంకో 'టెస్లా' వస్తాడా అయితే? అని నవ్వుకున్నాను.

నిద్రపట్టలేదు. తొలిప్రేమ తొలి ముద్దు అంత ఈజీగా మరిచిపోలేం. అందులోనూ ద్వారకలా.. అస్తమానం రెచ్చగొట్టి కవ్వించి నవ్వించి, అంతా తనే అనే భ్రమింపచేసే మనిషి సామీప్యం. ఆ స్నేహం నిజంగా నేను అతన్ని పోగొట్టుకున్నానా? కారణం ఏవిటి? ఫోన్‌లో అతని నెంబర్ తీసెయ్యలేదు. అదాటుగా వుంటే ఎప్పుడైనా అందులో 'ద్వారక' అనే అక్షరాలు రాకపోతాయా అని. చాలా దూరంగా ఏదో ఒక పరిమళం.. అలా అలా గాలిలో తేలి వస్తోంది ఏ తోటలో

పూచిన పువ్వునుండో.. కాదు ...కాదు ఏ హృదయంలో విరిసిన ప్రేమనుండో వలపు మొగ్గలు విచ్చి మధుర ప్రణయం అయితే ఆ పరిమళం ఇలాగే వుంటుందేమో? ఇది ఎక్కడిదో కాదు .నేను తలుపులు వేసి బంధించిన నా హృదయాంతరాళంలోంచి వస్తున్న సుగంధం. అతని పేరు తలుచుకుంటే, ఇప్పటికీ తాజాగా వున్న అనుభూతులు నా శరీరాన్ని వణికిస్తున్నాయి.

సిగ్గూ, వెరపూ, జంకూ మొదటిసారిగా విడిచేసిన ఆ రాత్రి గుర్తొస్తూనే వుంటుంది.

ఈ పట్టుదలా, అభిమానం, అహం అన్నీ వదిలేసి ఫోన్ తీసుకుని కాల్ చేద్దామా అనిపించింది.

ఒద్దు. మళ్ళీ ఎన్నో ప్రశ్నలు. పరీక్షలకి ఓపిక లేదు. హనీ చెప్పినట్లు చదువు మీద ఫోకస్ చేద్దామ అనిపించింది.

రాత్రి ఏడ్చానని పగలు అద్దం చెపితేకానీ తెలియలేదు.

నీనా ఎండ వస్తున్నా నిద్రలేవలేదు.

కాఫీ కలుపుకుని ,బాక్స్‌లో నిన్న ఆంటీ ఇచ్చిన పులిహోర పెట్టుకుని హడావిడిగా బయల్దేరాను.

బస్ ఎంతకీ రాలేదు. "హలో!" అని ఒక అబ్బాయి నవ్వుతూ వచ్చి పలకరించాడు.

"హలో" అన్నాను.

"ఐ యామ్ గేరీ.. వి ఆర్ ఇన్ ది సేమ్ క్లాస్" అన్నాడు.

ఇతను నా క్లాస్‌మేటా? గమనించి చూసాను. చాలా పొడవుగా వున్నాడు. మొహం అంతా పరుచుకునేట్లు నవ్వుతున్నాడు. కళ్ళు చిన్నవిగా వున్నాయి. ఎర్రగా టమాటా పండులా వున్నాడు.

"ఐ లైక్ యువర్ అటైర్" అన్నాడు.

"థాంక్యూ" నా కాటన్ చుడీదార్ వైపు చూసుకున్నాను. కలంకారీ డిజైన్. ఈ రోజు ఎందుకో ఇండియన్ డ్రెస్ వేసుకున్నాను. చాలా రోజులయింది కూడా ఇటువంటి కాంప్లిమెంట్ విని.

ఇంతలో బస్ వచ్చింది.

ఇద్దరం ఎక్కాం. గేరీ నా పక్కనే కూర్చున్నాడు .కాసేపట్లోనే అతను మంచి మాటకారి అని గమనించాను.

ఇలా పరదేశంలో ఒక తెల్ల అబ్బాయితో పక్క పక్క కూర్చుని, మాట్లాడుతూ కాలేజ్‌కి వెళ్తానని నాలుగు నెలల క్రిందట అనుకున్నానా?

ద్వారక రిజెక్షన్ కొత్త లోకాలకి ద్వారాలు తీసింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS